# భావితరాలకు కోహీర్ చరిత్రను అందించాలి

## భారత్ కర్షక పరిషత్ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి

కోహీర్, న్యూస్‌లైన్: కోహీర్ చరిత్రను భావితతరాలకు అందించే ప్రయత్నం చేయడం మంచి పరిణామమని భారత్ కర్షక పరిషత్ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. కోహీర్‌లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో ఆదివారం వేమనరెడ్డి సంఘం ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్‌రెడ్డి రాసిన 'ఓంకారేశ్వరీయం' కావ్యావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎన్నో గ్రామాలు, పట్టణాలు ఉన్నాయని, వాటిల్లో కొన్ని గ్రామాల చరిత్ర మాత్రమే చిరకాలం గుర్తుండిపోతుందన్నారు. విజయ్‌కుమార్‌రెడ్డి ఓంకారేశ్వరీయం పేరిట కోహీర్ చరిత్రను భావితరాలకు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పండితుడు వీరయ్య మాట్లాడుతూ ఓంకారేశ్వరీయం చాలా సరళమైన భాషలో సామాన్యులకు సైతం అర్థమయ్యేలా ఉందన్నారు. ఇది కోహీర్ పట్టణంలోని ప్రతి ఒక్కరి ఇంట్లో ఉండదగిన పుస్తకమన్నారు. మాజీ ఎమ్మెల్సీ తిరుమల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జాతీయోద్యమంలో కవులు, రచయితలు తమ రచనల ద్వారా ప్రజలను ప్రభావితం చేశారన్నారు.



ఓంకారేశ్వరీయం పుస్తకావిష్కరణ దృశ్యం

ప్రస్తుత తరుణంలో దేశభక్తిని పెంపొందించే రచనలకు పూనుకొవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పండితుడు రాఘవరెడ్డి తెలుగుభాషకు ఏర్పడనున్న ముప్పును జానపద గేయ రూపంలో వినిపించారు. లతీఫ్ ఆర్జు జాతీయ సమైక్యతపై వినిపించిన కవితలు ఆకట్టుకొన్నాయి. కవి నాళేశ్వరం శంకరం, గొట్టుముక్కల బ్రహ్మానందం, అనుపమారెడ్డి పుస్తకాన్ని పరిచయం చేశారు. కార్యక్రమంలో వేమనరెడ్డి సంఘం అధ్యక్షుడు జగన్నాథ్‌రెడ్డి, ప్రముఖ హిందీ కవి శివకుమార్ తివారీ, పండితులు చంద్రప్ప పాల్గొన్నారు.

# 'ఓంకారేశ్వరీయం' పుస్తకావిష్కరణ

కోహీర్: కోహీర్ పట్టణం ఘన చరిత్ర గలిగినదని, దీని గత చరిత్రను సాహితీ రూపంలో అవిష్కరించడం గర్వించదగ్గ అంశమని పలువురు కొనియాడారు. కోహీర్ విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రాసిన 'ఓంకారేశ్వరీయం' పుస్తకాన్ని వేమనరెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక సరస్వతీ శిశుమందిర్ పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హౌజింగ్ బోర్డు మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. గత



పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

విశిష్టతను ముందుకు తీసుకెళ్లకపోతే మరుగున పడుతుందని పేర్కొన్నారు. అలా కాకుండా కోహీర్ ఘన చరిత్రను విజయశ్రీ కలం పేరుతో రాయడం గొప్ప విషయమన్నారు. ఈ ప్రాంత విశిష్టతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందరికీ అర్థమయ్యేలా రూపొందించిన ఈ పుస్తకాన్ని ప్రతీ ఒక్కరు తప్పక చదవాలని వక్తలు సూచించారు. అనంతరం ప్రముఖులకు సన్మానించారు. కార్యక్రమంలో వేమనరెడ్డి సంఘం అధ్యక్షుడు జగన్నథ్‌రెడ్డి, కవి వీరయ్య, భారత కర్షక పరిషత్తు సభ్యుడు ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మారెడ్డి, కవులు లతీఫ్ ఆర్జూ, శివకుమార్ తివారి, స్థానిక పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

మెదక్ | ఆదివారం | జనవరి | 6 | 2013 సాక్షి

# పుస్తక రూపానికి 'ఓంకార'ం

- నాటి ఓంకార పట్టణమే నేటి కోహీర్
- నేడు ఆవిష్కరణ కార్యక్రమం



విజయకుమార్‌రెడ్డి

జహీరాబాద్, న్యూస్‌లైన్:

జిల్లాలోనే కోహీర్‌కు ఓ ప్రత్యేకత ఉంది. వాణిజ్య పంటల సాగు ఈ గ్రామం ప్రత్యేకత. గ్రామంలో పాడు మట్టి భూములుండడమే ఇందుకు ప్రధాన కారణం. స్వాతంత్ర్యం రాక ముందు కూడా కోహీర్‌కు ప్రత్యేక స్థానం ఉండేది. కోహీర్ చరిత్ర గురించి విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గడ్డమీది విజయకుమార్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో పుస్తక రూపంలో అందించాలని నిర్ణయించారు. గత ఏడాదిగా ఇందుకు సంబంధించిన సమాచారం సేకరించి 'ఓంకారేశ్వరీయం' పేరుతో పుస్తకాన్ని రూపొందించారు. ఈనెల 6వ తేదీన పుస్తకావిష్కరణ కార్యక్రమానికి కోహీర్ వేదిక కానుంది. క్రీస్తు పూర్వం 3,700 సంవత్సరాల క్రితం కపిల వంశజుడైన సుదర్శన చక్రవర్తి దండకారణ రాజ్యమును విస్తరింపజేసి ఓంకార పట్టణం రాజధాని (కోహీర్)గా ఏలాడు. ఓంకారేశ్వరుని ప్రభ దశ దిశలా వ్యాపించింది. ఓంకార పట్టణం ప్రధాన నగరాల్లో ఒకటై వెలిసింది. కాల క్రమేణ కట్టడాలు కనుమరగయ్యాయి. అక్కడక్కడ మిగిలి ఉన్న కళాఖండాలు, శిల్పాలు, కాలం చెరిపేసిన ఆనవాళ్లు, మట్టి కోటలు, గౌనిల పేర్లు చారిత్రక ఆధారాలను చాటిచెబుతున్నాయని విజయకుమార్‌రెడ్డి తన రచనల్లో పేర్కొన్నారు. అనేక ఇళ్లు, వ్యవసాయ బావుల వద్ద ధ్వంసమైన శిలలు నేటికీ దర్శనమిస్తున్నాయి. కాకతీయ ప్రతాపరుద్రుని ఆగమనంతో ఓంకార పట్టణంలో ఎక్కలదేవి ఆవిర్భావం జరిగిందని, ఆ తర్వాత పట్టణంలోని చారిత్రక ఓంకారేశ్వర నగరం వినాశనం అయిందన్నారు. కాకతీయులకు ముందు ఈ ప్రాంతం పశ్చిమ చాళుక్యుల స్వాధీనంలో ఉండేదని,ఈ ప్రాంతంలో జైన మతము రాజ్యమేలిందని విశ్లేషించారు. వీర సంగయ్య శిలా శాసనం, నాటి ఆలయాల శిల్పాలు, ఆరాధించే దేవతా విగ్రహాలే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యాలుగా ఉన్నాయన్నారు. కోటగడి ప్రాంతంలో మట్టి తవ్వుతున్న క్రమంలో బయల్పడిన శిలలోని తల భాగం జైన గురువుదిగా నిర్ధారించారు. కోహీర్ పట్టణంలోని పలు ప్రాంతాలలో ప్రస్తుతం దర్శనమిస్తున్న ఏనుగు శిల్పం, కట్టడానికి ఉన్న రెండు పదాల శిల్పం, పుష్పదళ చెక్కడం జైన మతానికి సంబంధించినవిగా పేర్కొన్నారు. 13వ శతాబ్దం ఆరంభంలో ఈ ప్రాంతానికి వచ్చిన కాకతీయ ప్రతాపరుద్రుని అనుమతితో మౌలానా మొయిజొద్దీన్ కొంత స్థలం పొందాడని, అతని మరణంతో ఆ ప్రాంతంలో ఆయన పేరిట దర్గా వెలిసిందని వివరించారు. కోహీర్ పట్టణ చరిత్ర పుస్తక రూపంలో తీసుకు రావడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కోహీర్ మేజర్ గ్రామ పంచాయతీగా ఉంది.







ఓంకార పట్టణ(కోహీర్) భౌగోళిక చిత్రం, ఓంకారేశ్వరీయం పేరుతో రూపొందించిన కోహీర్ చరిత్రకు పుస్తక రూపం

## నేడు పుస్తకావిష్కరణ

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రచించిన ఓంకారేశ్వరీయం పుస్తకావిష్కరణ కార్యక్రమం మండల కేంద్రమైన కోహీర్ పట్టణంలో ఈనెల 6వ తేదీన జరగనుంది. ఉదయం 11 గంటలకు శ్రీసరస్వతీ శిశు మందిరంలో నిర్వహించనున్న కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ బోర్డు మాజీ చైర్మన్ ఏ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ టీ లక్ష్మారెడ్డి, విశ్రాంత లెక్చరర్ గొట్టిముక్కల బ్రహ్మానందం, లెక్చరర్ నాగేశ్వరం పాల్గొననున్నారు.